సాక్షి అనకాపల్లి

బుధవారం । 31 । జనవరి । 2024



వైద్యరంగానికి పెద్దపీట

నర్సీపట్నంలో రూ.2.10 కోట్లతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించారు. 8లో



ఆధ్యాత్మిక సందడి

ఆధ్యాత్మిక గురువులు రవిశంకర్, త్రిదండి చినజీయర్ స్వామి వేర్వేరు విమానాల్లో విశాఖ రావడంతో సందడి నెలకొంది. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 29.8, కనిష్టంగా 21.6 డిగ్రీలు, తేమ 74 శాతం నమోదవుతాయని, గాలి గంటకు 6 కి.మీ. వేగంతో వీస్తుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



మాట్లాడుతున్న డీఐఈవో సుజాత

అనకాపల్లి: సీసీ కెమెరాల నిఘాలో వచ్చే నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి బి.సుజాత తెలిపారు. మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ కళాశాల ఆవరణలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జనరల్ విద్యార్థులకు 60, ఒకేషనల్‌కు 45 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 8,100 జనరల్ విద్యార్థులు, 4,849 మంది ఒకేషనల్ వారు ప్రాక్టికల్‌కు హాజరవుతారన్నారు. ఒకేషనల్‌కు వచ్చే నెల 5 నుంచి, జనరల్ విద్యార్థులకు 11 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షా కమిటీ అధికారులు పి.శిరీషారాణి, పీవీఎస్ మూర్తి, బాలకృష్ణ పాల్గొన్నారు.

మంచాల స్కూల్‌కు జాతీయ హరిత అవార్డు

- రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక మోడల్ పాఠశాల



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

చీడికాడ: మంచాల ఏపీ మోడల్ స్కూల్‌కు జాతీయ హరిత పాఠశాల అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకటలక్ష్మి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్, న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్సు అండ్ ఎన్విరాన్మెంటు ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌కు తమ స్కూల్ ఎంపికైందన్నారు. రాష్ట్రంలో ఉత్తమంగా నిలిచిన 12 పాఠశాలల్లో పర్యావరణానికి సంబంధించి తమ పాఠశాలలో ఎక్కువ కార్యక్రమాలు చేపట్టడంతో సీఎస్ఈ సంస్థ అవార్డును ప్రకటించిందన్నారు. ఈ అవార్డును సెక్రటరీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ అధికారి సంజయ్‌కుమార్, యునెస్కో ప్రతినిధి జాయిస్ పోన్, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ ప్రతినిధి జూలియా మార్టిన్, సెంటర్ ఫర్ సైన్సు అండ్ ఎన్విరాన్మెంట్ సీఈవో సునీత నాయర్ అందజేశారన్నారు. ప్రిన్సిపాల్, గ్రీన్ టీచర్ రమ్యశృతి, ఎన్జీఎస్ విద్యార్థులను ఈ సందర్భంగా డీఈవో వెంకటలక్ష్మమ్మ అభినందించారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చోడవరం: త్యాగరాజ ఆరాధనోత్సవాలు చోడవరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. చోడవరం త్యాగరాజ వాయిద్య సంగీత పాఠశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా త్యాగరాజ చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. సంగీత పాఠశాల బృందం కచేరీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ మాజీ చైర్‌పర్సన్ బంటు నళిని, సంగీత పాఠశాల ప్రిన్సిపల్ రాయవరపు నానాజీ, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ మంగళవారం తెలిపారు. మాకవరపాలెం నాక్ శిక్షణ కేంద్రంలో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. పది పాసై, 15 నుంచి 45 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 7780275922 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న ఇండియా ఆటగాళ్లు యశస్వి జైశ్వాల్, శ్రేయస్ అయ్యర్, బుమ్రా, కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ ఆటగాళ్లు

క్రికెటర్లు వచ్చేశారు

- ఫిబ్రవరి 2 నుంచి రెండో టెస్ట్
- విశాఖ చేరుకున్న భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: భారత్-ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా రెండో టెస్ట్‌కు పీఎంపాలెంలోని వైఎస్సార్-ఏసీఏ స్టేడియం సిద్ధమైంది. ఫిబ్రవరి రెండో తేదీ నుంచి జరిగే ఈ టెస్ట్‌లో ఆడే భారత్, ఇంగ్లండ్ జట్లు మంగళవారం విశాఖ చేరుకున్నాయి. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ రెండు జట్ల ఆటగాళ్లు విశాఖ విమానాశ్రయంలో అడుగు పెట్టారు. తమ అభిమాన క్రికెటర్లను చూడడానికి అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలివచ్చారు. ఇరు జట్ల క్రీడాకారులను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్ష కార్యదర్శులు శరత్‌చంద్రరెడ్డి, ఎస్ఆర్ గోపీనాథరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు నోవాటెల్‌కు చేరుకున్నారు. బుధ, గురువారాల్లో ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటారు.

ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టెస్ట్‌లో తొలి రెండు రోజులు ఆధిక్యాన్ని ప్రదర్శించిన భారత్ జట్టు అనూహ్యంగా నాలుగు రోజుల్లోనే మ్యాచ్‌ను ముగించేసి పరాజయం మూటగట్టుకుంది. బజ్‌బాల్ క్రికెట్ పద్ధతిని ఆకళింపు చేసుకున్న ఇంగ్లండ్ జట్టు అనూహ్యంగా తొలి మ్యాచ్ విజయం సాధించి, 1-0 ఆధిక్యంతో విశాఖకు విచ్చేసింది. తొలి టెస్ట్‌లో గాయపడిన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా మినహా రెండో టెస్ట్‌కు ఎంపిక చేసిన పూర్తి భారత జట్టు విశాఖ చేరుకుంది.

గాంధీ మార్గం అనుసరణీయం



కె.కోటపాడులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న విద్యార్థులు

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.కోటపాడులోని ఒక ప్రైవేటు పాఠశాలలో గాంధీజీ వేషధారణలో ఒక విద్యార్థి రాట్నం వడుకుతున్న దృశ్యం ఆకట్టుకుంది. - కె.కోటపాడు



గాంధీజీ వేషధారణలో రాట్నం వడుకుతున్న చిన్నారి

పశు బీమా.. రైతన్నకు ధీమా

- ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.33 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- రైతులు 20 శాతం వాటా చెల్లిస్తే చాలు
- సంకర జాతి పశువుల అభివృద్ధికి, పెయ్యలు జన్మించేందుకు రాయితీపై ఇంజక్షన్లు
- లేగదూడల ప్రదర్శన ద్వారా ప్రోత్సాహకాలకు రూ.3 లక్షలు మంజూరు



జిల్లేడుపూడిలో ఇంజక్షన్‌తో జన్మించిన పెయ్యను పరిశీలిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టరు సూర్యనారాయణ, డెయిరీ మేనేజరు సత్యనారాయణ, సిబ్బంది

నాతవరం: ప్రభుత్వం పాడి రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పశుగణాభివృద్ధి సంస్థ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పశువులకు బీమా సదుపాయం కల్పించేందుకు ఇటీవల ప్రభుత్వం రూ.33 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పశువు విలువను బట్టి పశు బీమా సదుపాయం కల్పిస్తారు. రైతు వాటా 20 శాతం, ప్రభుత్వం వాటా 80 శాతంగా నిర్ణయించారు. ఈ విషయంపై జిల్లావ్యాప్తంగా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. వైఎస్సార్ పశు బీమాకు సంబంధించి ఆర్బీకేలలో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు క్షేత్రస్థాయిలో తెలియజేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్నిచ్చే పాడి ఉత్పత్తిని మరింత అభివృద్ధి చేసేందుకు సంకర జాతి పశువులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇంజక్షను ద్వారా కృత్రిమ గర్భధారణ కోసం, ఆడ పెయ్యలు జన్మించేందుకు రాయితీపై ప్రభుత్వం ఇంజన్లు సరఫరా చేస్తుంది. ఒక ఇంజక్షన్ ఖరీదు రూ.1,350 కాగా ప్రభుత్వం రైతులకు రాయితీపై రూ.500లకే సరఫరా చేస్తుంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 4 వేలు ఇంజన్లు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. ఇంతవరకు ఉమ్మడి జిల్లాలో 2690 ఇంజక్షన్లు చేశారు. మిగతావి ఈ ఏడాది మార్చి నెలాఖరు లోపు పూర్తి చేయాల్సి ఉంది. గత ఏడాది ఇంజన్ల ద్వారా జన్మించిన ఆడపెయ్యలు మండలానికి 25 నుంచి 30 వరకు ఉన్నాయి. ఇదిలా వుండగా పాడి ఉత్పత్తితోపాటు లేగ దూడల ప్రదర్శన ద్వారా కూడా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో లేగదూడల ప్రదర్శనల కోసం ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో 30 పైగా లేగదూడల ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. ఇంతవరకు 20 వరకు లేగ దూడల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో లేగ దూడలను ఆరోగ్యంగా పెంచే రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. ప్రోత్సాహకాలతో పాటు లేగదూడలకు ఉచితంగా పాముల మందులు ఇంజక్షన్లు సరఫరా చేసి రైతులను మరింత ఉత్తేజపరుస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేస్తున్నారు. పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న 156 మంది గోపాలమిత్రులతో పాటు పశుసంవర్ధకశాఖ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



శృంగవరంలో రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న అధికారులు

ఆడ పెయ్యల ఇంజక్షన్‌తో రైతుకు లాభం



ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న ఆడపెయ్యల ఇంజన్ల వల్ల అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. వాస్తవంగా ఇంజక్షను ఖరీదు రూ.1350 కాగా మేము రైతుకు రాయితీపై రూ 500లకే వేస్తున్నాం. జిల్లాలోనే అధికంగా మా ప్రాంతంలో ఆడపెయ్యలు జన్మించాయి. అధిక పాల ఉత్పత్తితో పాటు ఆడపెయ్య వలన ఆదాయం మరింత పెరుగుతుంది. మండలంలో జిల్లేడుపూడి వెంకయ్యపాలెంలో జన్మించిన పెయ్యలను చూసేందుకు అధికంగా మా ప్రాంతం వస్తున్నారు.

– కిల్లాడ వెంకటరమణ, గోపాలమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు ఉపయోగించుకోవాలి. పాడి పశువు అకాల మరణం పొందితే వైఎస్సార్ పశు బీమా పథకంలో రైతుకు ఆర్థిక సాయం అందిస్తాం. పశువు విలువను బట్టి ఈ బీమా చేసేందుకు రైతు వాటా 20 శాతం, ప్రభుత్వ వాటా 80 శాతం చెల్లించాలి. ఆడ పెయ్యలు జన్మించేందుకు ప్రభుత్వం వారు రాయితీపై ఇంజక్షను చేస్తున్నారు. లేగ దూడలను ఏపుగా పెంచేందుకు రైతుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ఆర్బీకేల్లో పనిచేసే సిబ్బంది, గోపాలమిత్రులు సంయుక్తంగా పాడి రైతులకు అవసరమైన సేవలు అందిస్తున్నారు.

–రామ్మోహన్‌రావు, ఉమ్మడి విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టరు

పిల్లలకు మరింత సత్వర వైద్య సేవలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్



బాలల సత్వర చికిత్సా కేంద్రం సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి హేమంత్

నర్సీపట్నం: అత్యవసర సేవలను పిల్లలకు మరింత చేరువ చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హేమంత్ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. చెవిటి, మూగ, అంగవైకల్యం, బుద్ధి మాంద్యం పిల్లలకు సంబంధించిన విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రం ద్వారా సేవలను మరింత విస్తృతం చేయాలని మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌కు సూచించారు. సిబ్బంది లేక శానిటేషన్ నిర్వహణకు ఇబ్బందిగా ఉందని మెడికల్ ఆఫీసర్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. వారం రోజుల్లో శానిటేషన్ సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటానని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. పెయింటింగ్ పనుల్లో జాప్యం జరగకుండా వారం రోజుల్లో పూర్తి చేయించాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు.

'పిట్టల'తో చేపల వేట!



8లో

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి

- చేతివృత్తుల వారికి విశ్వకర్మ నమోదు చేయాలి
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల అభివృద్ధి కమిటీ సమీక్షలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని, నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా పూర్తికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపన, అభివృద్ధి విషయంలో సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. పరిశ్రమలన్నీ భద్రతా ప్రమాణాలు తప్పక పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో హమాలీల చార్జీలను పెంచే విషయంలో త్వరగా నిర్ణయాలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా పారిశ్రామికంగా త్వరితగతిన అభివృద్ధి చెందుతున్నందున పీఎంఈజీపీ కార్యక్రమంలో లక్ష్యాలు సాధించినప్పటికీ మరిన్ని ఎక్కువగా రుణాలు మంజూరు చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజనలో చేతివృత్తుల వారిని గుర్తించి రిజిస్టర్ చేయించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో శిశువుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసేలా కంపెనీలను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీ దయానిధి, ఆర్డీవో ఎ.చిన్నికృష్ణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్ఎం త్రినాథ్, డీపీవో ఆర్ శిరీషారాణి, డీఆర్డీఏ పీడీ కే శచీదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, జిల్లా అధికారులు పారిశ్రామికవేత్తలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేయండి

- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా శాంతియుతంగా రానున్న ఎన్నికలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో నిఘా ముమ్మరం చేయాలని, చెడు నడత కలిగిన వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు దిగువ స్థాయి అధికారులు ప్రణాళికలు నిర్వహించుకోవాలన్నారు. మద్యం, గంజాయి, సారా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వివిధ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మర వాహన తనిఖీలు చేయాలన్నారు. ప్రధానమైన ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సీఆర్పీసీ కేసులు, గంజాయి, మిస్సింగ్ కేసులపై ఆయన ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను అమలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లు గుర్తించి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి తగు నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, నర్సీపట్నం సబ్ డివిజన్ అధికారి అదిరాజ్ సింగ్‌రాణా, డీఎస్పీలు వి.సుబ్బరాజు, కె.వి.సత్యనారాయణ, సీఐలు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికయిన జిల్లా జట్లతో నిర్వాహకులు

అచ్యుతాపురం: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను మంగళవారం అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో ఎంపిక చేశారు. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో భీమిలి సన్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తారు. ఎంపికై న జిల్లా జట్ల వివరాలను జిల్లా రగ్బీ కోచ్ వెంకట్, నిర్వాహకుడు కూండ్రపు వెంకునాయుడు ప్రకటించారు.

బాలుర జట్టు: ఎం.చరణ్, వి.వెంకటేష్, బి.విజయ్‌కుమార్, వి.ఆనంద్, ఎస్.శశిధర్, పి.తరుణ్, టి.ప్రేమ్‌కుమార్, టి.యుగేంద్ర, ఎం.గణేశ్, కె.వంశీ, ఎం.అషీద్‌ఖాన్, కె.హేమంత్,

బాలికల జట్టు: టి.వాణిశ్రీ, పి.గీతసాయి, ఎ.అర్చన, ఎల్.చైత్ర, సిహెచ్.వర్షిణి, ఎల్.హాసిని, జి.తులసీకుమారి, జి.కె.వి.పి.తిరుమల, భవ్యతశ్రీ, టి.భావన, బి.వైజయంతి, పి.సంగీత

నమ్మక ద్రోహం

- స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో రూ.కోటికి బురిడీ
- డ్రైవర్ కుమారుడు కావడంతో నమ్మి మోసపోయిన వ్యాపారి
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

యలమంచిలి రూరల్: తన తండ్రి ఇరవై ఏళ్లపాటు డ్రైవర్‌గా పనిచేసిన యజమానిని, అతని నమ్మకాన్ని అవకాశంగా చేసుకుని ఓ యువకుడు నిలువునా మోసగించాడు. ఒకటి, రెండు లక్షలు కాదు.. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో బురిడీ కొట్టించి ఏకంగా రూ.కోటి కాజేశాడు. 'షేర్ మార్కెట్ పేరుతో రూ.కోటికి కుచ్చు టోపీ' శీర్షికతో సాక్షి దిన పత్రిక మంగళవారం సంచికలో ఈ వార్త ప్రచురితమైన విషయం విదితమే. బాధితుడి ఫిర్యాదుతో యలమంచిలి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. యలమంచిలి పట్టణం సీపీ పేటకు చెందిన వీసం రామకృష్ణ గతంలో ఐరన్ స్క్రాప్ వ్యాపారం చేసేవారు. ఆయన వద్ద అచ్యుతాపురానికి చెందిన నెట్టెం గోవింద్ డ్రైవర్‌గా 20 ఏళ్లు పనిచేశాడు. యజమానికి డ్రైవర్ అంటే అపారమైన నమ్మకం. ఈ డ్రైవర్‌కు కూడా యజమాని రామకృష్ణ పట్ల ఎంతో విశ్వాసం. ఈ పరిస్థితుల్లో డ్రైవర్ కుమారుడు నెట్టెం సాయి శ్యామ్‌కుమార్ స్టాక్ మార్కెట్ పేరుతో యజమాని వీసం రామకృష్ణకు కుచ్చుటోపీ పెట్టాడు.

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో అపారమైన లాభాలు వస్తాయని, తన స్నేహితుడు పెట్టుబడి పెడితే తాను స్టాక్‌మార్కెట్ లావాదేవీలు చేస్తున్నానని నమ్మించాడు. వచ్చిన లాభాలను తన స్నేహితుడు 60 శాతం, తాను 40 శాతం తీసుకుంటున్నామని నమ్మబలికాడు. అందుచేత మీరు కూడా పెట్టుబడి పెడితే బోలెడు లాభాలు తెస్తానని మోసపూరితమైన మాటలు చెప్పడంతో రామకృష్ణ నిజమేననుకున్నారు. రూ.50 లక్షలు పెట్టుబడి పెడితే ఆరు నెలల్లో రూ.1.2 కోట్లు తమ స్నేహితుడికి వచ్చాయని ఫేక్ ఆన్‌లైన్ మెసేజ్‌లు సృష్టించి, వాటి స్క్రీన్‌షాట్‌లను రామకృష్ణకు చూపించాడు. దీంతో ఆయన మొదట రూ.20 లక్షలు తన ఖాతా నుంచి శ్యామ్‌కుమార్ బ్యాంకు ఖాతాకు ఆన్‌లైన్ బదిలీ చేశారు. ఆ తరువాత మరో రూ.20 లక్షలు, తదుపరి రూ.30 లక్షలు, అనంతరం రూ.28 లక్షలు, చివరిగా రూ.2 లక్షలు నగదు పంపించారు. సెప్టెంబరు 2022 నుంచి ఫిబ్రవరి 2023 వరకూ ఐదు దఫాలుగా నగదును శ్యామ్‌కుమార్ ఖాతాకు బదిలీ చేశారు. అప్పటి నుంచి రోజూ సెల్‌ఫోన్ ద్వారా ఫేక్ మెసేజ్‌లు పెట్టి లాభాలు వచ్చినట్టు శ్యామ్‌కుమార్ వీసం రామకృష్ణకు చూపేవాడు. ఆయన పెట్టిన రూ.కోటి పెట్టుబడి రూ.2.80, 50,000లకు పెరిగిందని చెప్పాడు.

షేర్ మార్కెట్ నుంచి విత్ డ్రా చేయకపోవడంతో అనుమానం

షేర్ మార్కెట్ ప్రమాదమని, డబ్బు విత్ డ్రా చేయమని, గత ఏడాది ఆగస్టులో రామకృష్ణ కోరారు. కానీ శ్యామ్‌కుమార్ నుంచి సరైన స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చింది. ఎన్నిసార్లు అడిగినా వాయిదాలు పెడుతూ డిసెంబరు 21 వరకూ కాలయాపన చేశాడు. డిసెంబరు 21న పోలీసుల దృష్టికి తీసుకెళితే 2024 జనవరి 1 నాటికి ఇచ్చేస్తానని రాత పూర్వకంగా శ్యామ్‌కుమార్ రాసి ఇచ్చినట్టు బాధితుడు చెప్పారు.

ఆ తరువాత అతను ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం, డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులకు బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్యామ్‌కుమార్ ట్రేడింగ్‌కు ఉపయోగించిన లాప్‌టాప్‌ను పరిశీలిస్తే డీ మ్యాట్ అకౌంట్, ట్రేడింగ్ ఖాతాల వివరాలు తెలియలేదు. తప్పుడు పాస్‌వర్డ్‌లు చెప్పేవాడని బాధితుడి బంధువు చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు పట్టణ ఎస్సై పాపినాయుడు తెలిపారు. కేసు నమోదైన విషయాన్ని తెలుసుకున్న శ్యామ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా

టెక్నికల్ సర్టిఫికెట్స్ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి : ప్రభుత్వ గుర్తింపు పొందిన సెంటర్లో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఏప్రిల్ –2024 ప్రవేశానికి అర్హతకలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్‌లో(లోయర్,హైయర్ గ్రేడ్‌లు), హ్యాండ్ లూమ్ వీవింగ్(లోయర్, హైయర్ గ్రేడ్‌లు), టైలరింగ్, ఎంబ్రాయిడరీ (లోయర్, హైయర్ గ్రేడ్‌లు) కోసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్టు ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు www.bre.ap.gov.in ను సంప్రదించాలని ఆమె కోరారు.

సీతం కళాశాలలో భారీ జాబ్‌మేళా

అనకాపల్లి : విజయనగరం గాజులరేగ సీతం కళాశాలలో బుధవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 80 కంపెనీలతో ఏర్పాటు చేసిన ఈ మేళాకు టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హత, 18 నుంచి 30 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు అర్హులని, మరిన్ని వివరాలకు 9014765287, 7036363272 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ప్రసాదరావు తదితరులు

రాంబిల్లి: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు దిమిలి ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం జి. ప్రసాదరావు తెలిపారు. అచ్యుతాపురంలో జరిగిన అండర్ 14 విభాగంలో రగ్బీ క్రీడలో ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కోచ్ వెంకటేష్, గణిత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం

- అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్



అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధి గవరవీధి, బలిఘట్టంలో రూ.2.10 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకువెళ్లాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలకు ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వానికి మీ అందరి సహకారం అందించాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎ.హేమంత్ మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లకుండా ఉన్నచోటే వైద్య సేవలు పొందవచ్చన్నారు. అర్బన్‌హెల్త్ సెంటర్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు సేవలు అందిస్తారన్నారు. 172 రకాల మందులను ఉచితంగా అందిస్తామన్నారు. అవసరమైన రోగులకు 63 రకాల టెస్టులు నిర్వహిస్తారన్నారు. స్పెషలిస్టుల సర్వీస్సులు అవసరమైన వారికి టెలీ మెడిసిన్ హబ్ ద్వారా డాక్టర్లను సంప్రదించి రోగికి అవసరమైన మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ యాదగిరి మణి, దాడి కృష్ణవేణి, బుల్లిదొర, మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, ఏఎంసీ చైర్మన్ మళ్ల గణేష్, పార్టీ నాయకులు యాదగిరి శేషు, లోవరాజు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అపరిశుభ్రతపై ఆగ్రహం



రావికమతం పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న జ్యోతి



పీహెచ్‌సీలో ఎక్కడికక్కడ మూటలు, అట్టపెట్టెలు

- రావికమతం పీహెచ్‌సీ తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి
- గోడౌన్‌ను తలపించడంపై అసంతృప్తి

రావికమతం : స్థానిక పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు, ఆస్పత్రిలో వాతావరణం దుమ్ము, ధూళి పట్టి, పేషెంట్లు కూర్చునే చోట స్ట్రెచర్లు ఉండడం చూసి వైద్యాధికారి శ్రీనివాస్‌తోపాటు స్టాఫ్ నర్సుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించిన మెటీరియల్ ఎక్కడికక్కడ పడి ఉండడాన్ని చూసి ఇది ఆస్పత్రా, లేక గోదామా అని అసహనం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడు సిబ్బందిని రప్పించి దగ్గరుండి శుభ్రం చేయించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు.

ఆరోగ్య సురక్షకు ప్రజల్లో ఆదరణ

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష , ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తుందన్నారు. గ్రామాల్లోనే మంచి వైద్య సేవలందడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్న దృష్ట్యా ఆ కార్యక్రమాలపై మరింతగా శ్రద్ధ తీసుకుంటున్నామని, గైనకాలజిస్టులతో పాటు న్యూరాలజిస్టులను అన్ని క్యాంప్‌లలో అందుబాటులో ఉంచుతామని అన్నారు.

రెండు రోజుల్లోనే బంగారం దొంగ అరెస్టు

- 6.5 తులాల బంగారం రికవరీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి : సీసీ టీవీ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా నేరాలు నిరోధించవచ్చని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల పట్టణంలో జరిగిన చోరీ ఘటనలో త్వరితగతిన నిందితుడిని పట్టుకుని, చోరీ సొత్తు రికవరీ చేసినట్టు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలివి. ఈనెల 26న పట్టణంలో గవరపాలెంలోని కర్రి లక్ష్మీనారాయణమ్మ ఇంట్లో రాత్రి 8 గంటలకు కేబుల్ రిపేరు కోసం వెళ్లిన కేబుల్ మెకానిక్ మళ్ల గోవింద్ ఇంట్లో ఒంటరిగా ఉన్న నారాయణమ్మను తువ్వాలుతో పీక బిగించి మెడలో ఉన్న 6.5 తులాల బంగారం వస్తువులు అపహరించుకుని పోయాడు. ఆదేరోజు రాత్రి నారాయణమ్మ ఇంటికి వచ్చిన బావ కాండ్రేగుల మురళీకృష్ణ, చెల్లి నాగచంద్రిక ఇంట్లో పడిఉన్న నారాయణమ్మను గమనించి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఈనెల 27న విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా నారాయణమ్మ కుమారుడు ఈనెల 28న ఇంట్లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తి కేబుల్ ఆపరేటర్ గోవింద్‌గా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడి కోసం గాలించిన పోలీసులు ఈనెల 30న గవరపాలెం సంతబయల వద్ద తిరుగుతున్న మళ్ల గోవింద్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 6.5 తులాల బంగారం(నాలుగుపేటలు), ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా రెండు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరరావు ఎస్ఐ పి.సింహాచలం పాల్గొన్నారు.

రేపు యలమంచిలిలో హాకీ ఎంపికలు

యలమంచిలి : యలమంచిలి డిగ్రీ కళాశాల హాకీ మైదానంలో గురువారం హాకీ క్రీడకు సంబంధించి జూనియర్ బాలికలు , సబ్‌జూనియర్ బాలుర ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి జిల్లా హాకీ చైర్మన్ ఆడారి వీరునాయుడు తెలిపారు. ఈ ఎంపికలకు హాకీ క్రీడాకారులు 2005 నుంచి పుట్టినవారు అర్హులని, సెలెక్షన్స్‌కు వచ్చే సమయంలో తమ వెంట ఆధార్‌కార్డు జెరాక్స్, స్టడీ సర్టిఫికేట్‌లు అర్హత కలిగిన ధ్రువపత్రాలు తీసుకురావాలని ఆయన సూచించారు.

చోడవరం నియోజకవర్గంలో మరో 7 కొత్త రోడ్లు

చోడవరం : నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన ఏడు పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం చెప్పారు. ఈ రోడ్ల నిర్మాణానికి రూ. 21.32 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. రావికమతం మండలంలో సీకేపాడు నుంచి చలిసింగం రోడ్డుకు రూ.2.65 కోట్లు, మేడవాడ- కానాడ రోడ్డుకు రూ. కోటి 24 లక్షలు, తోటకూరపాలెం నుంచి కన్నూరుపాలెం రోడ్డు జంక్షన్ వరకూ రూ.5.33 కోట్లు, చినపాచిలి నుంచి టి. అర్జాపురం మీదుగా బిఎన్‌రోడ్డు జంక్షన్‌కు రూ.6.98 కోట్లు మంజూరయ్యాయి. చోడవరం మండలంలో చోడవరం, తిమ్మన్నపాలెం రోడ్డు నుంచి వయా పోలేపల్లి మీదుగా బుచ్చెయ్యపేట జంక్షన్ వరకూ 4.71 కిలోమీటర్ల రోడ్డుకు రూ. కోటి 51లక్షలు, రోలుగుంట మండలంలో ఒడ్డిప నుంచి గైరంపేట, బీబీ పట్నం రోడ్డుకు రూ.2.31 కోట్లు, బుచ్చెయ్యపేట మండలంలో సీతయ్యపేట – తట్టబంద బీటీ రోడ్డు జంక్షన్ నుంచి రాజుపాలెం రోడ్డుకు రూ.కోటి 30 లక్షలు మంజూరయ్యాయి. నాబార్డు ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయని ధర్మశ్రీ చెప్పారు. త్వరలో రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన చెప్పారు.

చూచుకొండలో ఘనంగా వైఎస్సార్ తీర్థం



మహానేత రాజన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం

మునగపాక : మండలంలోని చూచుకొండలో మంగళవారం మహానేత వైఎస్సార్ తీర్థం ఘనంగా జరిగింది. ఏటా జనవరి 30వ తేదీన తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది కూడా గ్రామస్తులు వైఎస్సార్ తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. మహానేత రాజన్న విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత రాజన్న హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు. రాజన్న ఆశయ సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్,మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గుంట్ల అప్పారావు, రాయి బుజ్జి, కృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మహిళల చిటికల భజన అందరినీ ఆకట్టుకుంది.

మినీ జాబ్ మేళాలో 10 మంది ఎంపిక



మినీ జాబ్ మేళాలో అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, చిత్రంలో కంపెనీ నిర్వాహకులు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మినీ జాబ్ మేళాలో పలువురు నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పాయకరావుపేట డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఫార్మా కంపెనీలో ట్రైనీ కెమిస్ట్ పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మినీ జాబ్‌మేళాను యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇలాంటి ఉద్యోగ నియామకాలను గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమికంగా 10 మందిని ఎంపిక చేశామని, తుది దశలో వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత నియామకాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.22,000 వేతనం ఉంటుందని డెక్కన్ ఫైన్ కెమికల్స్ హెచ్‌ఆర్ మేనేజర్ దీపిక తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఇన్‌ఛార్జ్ రితేష్‌సింగ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ వెంకన్న, స్కిల్ హబ్ ఇన్‌ఛార్జ్ ఎం. ప్రసన్న పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ ఉత్సవాలు



120 మందితో బృంద గాత్ర కచేరి

మద్దిలపాలెం: కళాభారతిలో త్యాగరాజ ఉత్సవాలు రెండో రోజు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్యాగరాజ స్వామి, శ్రీసీతారామ పరివారానికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్. గుమ్మలూరి రాంబాబు శోభాయామనంగా ఊరేగింపు నిర్వహించారు. అప్పన్న శ్రావ్యంగా నాదస్వరం వాయిస్తూ ఉండగా త్యాగరాజ కీర్తలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళానిధి డాక్టర్. నైవేలి సంతన గోపాలం, ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయరాజు, ఎస్.రామగోపాల్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. కోలాటంతో మహిళలు ఆకట్టుకున్నారు. సాయంత్రం గాత్ర కచేరిలో 120 మంది గాయనీ,గాయకులు ఒకేసారి బృంద గానం చేసి అలరించారు.

అమ్మవారి ఆలయంలో హుండీ చోరీ

- రూ.20 వేల నగదు, సీసీ కెమెరాల అపహరణ



నగదు దొంగలించుకుపోయిన అమ్మవారి హుండీ



కట్ చేసి ఉన్న సీసీ కెమెరాల వైర్లు

అనకాపల్లి : కేఎన్‌ఆర్ పేట మోద కొండమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగలగొట్టి రూ.20వేల నగదుతో పాటు సీసీ కెమెరాల కేబుల్స్ కట్ చేసి యూనిట్లతో పాటు కెమెరాలను దొంగలించుకు పోయారు. జనవరి మొదటి వారంలో చోరీ ఘటనపై ఆలయ కమిటీ సభ్యులు బి.నాగేశ్వరరావు, సంతోష్ గ్రామీణ ఎస్ఐ తేజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ దర్యాప్తు చేస్తుండగా మరోసారి చోరీ జరగడంతో గ్రామస్తుల్లో ఆందోళన చోటుచేసుకుంది. ఎస్ఐ సాక్షి మాట్లాడుతూ ఆలయంలో చోరీ సంఘటనలపై దర్యాప్తు ముమ్మురం చేస్తామని తెలిపారు. రాత్రి గస్తీని పెంచి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అన్నారు.

2వ తేదీ నుంచి వెటరన్స్ టెన్నిస్

విశాఖ స్పోర్ట్స్: వెటరన్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఈనెల 2వ తేదీనుంచి విశాఖలో ప్రారంభం కానుంది. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానికంగా మరో మూడు క్లబ్‌ల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. 35+నుంచి 75+ వరకు పలు కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలు జరగనున్నాయి. రెండో తేదీ నుంచి క్వాలిఫైయింగ్ రౌండ్స్ జరగనుండగా 4వ తేదీ నుంచి సింగిల్స్ మెయిన్ డ్రా, ఐదో తేదీ నుంచి డబుల్స్ మెయిన్ డ్రా పోటీలు జరగనున్నాయి.

స్కూబా డైవింగ్‌కు రుషికొండ తీరం అనుకూలం



స్కూబా డైవింగ్ చేస్తున్న జెస్సీకామన్నా

కొమ్మాది: స్కూబా డైవింగ్‌కు రుషికొండ తీరం అనువైన ప్రాంతమని, లోతైన సముద్ర గర్భంలో అందమైన వింతలు ఎన్నో తమను ఆకట్టుకున్నాయని అమెరికాకు చెందిన ప్రఖ్యాత స్కూబా డైవింగ్ మాస్టర్ జెస్సీకామన్నా అన్నారు. స్కూబా డైవింగ్‌కు విశాఖ డెస్టినేషన్‌గా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా ఆమె మంగళవారం రుషికొండ తీరాన్ని సందర్శించి కాసేపు స్కూబా డైవింగ్ చేశారు. ఈ డైవింగ్‌లో సముద్రం లోతును అన్వేషించినట్లు తెలిపారు. విశాఖలోని తీర ప్రాంతాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఆమె తన అనుభవాలు స్థానిక స్కూబా డైవర్స్‌తో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ ఇన్ అడ్వెంచర్ వ్యవస్థాపకుడు బి.బలరామనాయుడు పాల్గొన్నారు.

'పిట్టల'తో చేపల వేట!

- ఎర చేపలకు రేడియం గాలాలు
- వీటిని పిట్టలుగా వ్యవహరిస్తున్న మత్స్యకారులు
- ఈ తరహా ఇప్పటి వరకు గుజరాత్‌లో వేట
- అదే బాటను అనుసరిస్తున్న ఆంధ్ర జాలర్లు



ఎర చేపలకు అమర్చిన పిట్టలు



ఎరగా వేసే చిన్న చేపలకు అమర్చిన గాలాలు

సాక్షి, విశాఖపట్నం: పిట్టలతో చేపల వేట! వినడానికి ఒకింత ఆశ్చర్యంగా ఉంది కదా? అయితే కొన్నాళ్లుగా మత్స్యకారులు ఇలా పిట్టలతోనే వేట సాగిస్తున్నారు! అయితే ఇవి నిజమైన పిట్టలు కాదు.. గాలాలతో పెద్ద చేపలను వేటాడటానికి చిన్న చేపలను ఎరగా వేస్తుంటారు. ఈ చిన్న చేపలను ఇనుప హుక్‌లకు గుచ్చి బోటు నుంచి సముద్రంలోకి వదులుతారు. ఈ చేపలను తినడానికి పెద్ద చేపలు వస్తాయి. చిన్న చేపలను మింగిన పెద్ద చేపలు గాలాలకు చిక్కుకుంటాయి. ఇదంతా గాలాలతో జరిగే వేట ప్రక్రియ. అయితే ఎర వేసిన చేపల తోక భాగంలో పెద్ద చేపలను ఆకర్షించడానికి వీలుగా రేడియంతో చేసిన రూస్టర్ టెయిల్స్‌ను కూడా అమరుస్తారు. ఇవి పక్షి ఈకలు మాదిరిగా ఉంటాయి. అందువల్ల మత్స్యకారులు వీటిని పిట్టలుగా వ్యవహరిస్తారు. ఈ రూస్టర్ టెయిల్స్ రేడియం కాంతిని కలిగి ఉండడంతో సుదూరంలో ఉన్న చేపలను ఆకట్టుకుంటాయి. ఇన్నాళ్లూ ఈ తరహా చేపలవేట గుజరాత్‌లోని వీరావల్ సహా మరికొన్ని ప్రాంతాల్లో అక్కడ మత్స్యకారులు చేపడుతున్నారు. కొన్నాళ్ల నుంచి ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ ఈ పిట్టల వేటను సాగిస్తున్నారని రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు.

రూస్టర్ టెయిల్ ధర రూ.50

ఒక్కో పిట్ట (రూస్టర్ టెయిల్) ఖరీదు రూ.50 వరకు ఉంటోంది. వీటిని పలుమార్లు ఉపయోగించుకునే వీలుంది. ఈ పిట్టలతో చేపల వేట ఆశాజనకంగా ఉండడంతో కొంత మంది మత్స్యకారులు క్రమంగా అదే బాటలో పయనిస్తున్నారు. ఈ గాలాలకు ఖరీదైన, మార్కెట్లో మంచి ధర పలికే బొంతలు, పారలు, మట్టలు, ఎర్ర చేపలు, సైమన్లు, కోనాం, రాయి చేపలు వంటివి చిక్కుతున్నాయి. వీటి బరువు రెండు నుంచి ఐదారు కిలోల వరకు ఉంటాయి. మార్కెట్లో వీటికి రకాన్ని బట్టి కిలో రూ.200 నుంచి 600 వరకు మంచి ధర పలుకుతోంది. అసలే మర బోట్లతో సాగిస్తున్న సంప్రదాయ వేట డీజిల్ ధర ఎగసి పడుతుండడంతో గిట్టుబాటు కావడం లేదన్న భావనతో మత్స్యకారులున్నారు. ఇలాంటి వారు పిట్టల వేట వైపు ఆకర్షితులవుతున్నారు.

ఆధ్యాత్మిక సందడి

- విశాఖ విమానాశ్రయానికి త్రిదండి, పండిట్ రవిశంకర్ రాక

గోపాలపట్నం(విశాఖ): ఆధ్యాత్మిక గురువులు రవిశంకర్, త్రిదండి చినజీయర్ స్వామి వైర్వేరు విమానాల్లో మంగళవారం విశాఖ చేరుకున్నారు. గీతం యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి విశాఖ వచ్చిన గురుదేవ్ రవిశంకర్.. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో వర్సిటీకి వెళ్లారు. త్రిదండి చినజీయర్ స్వామీజీ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చారు. ఆయన్ని కలుసుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి స్వామి ప్రసాదాలు అందించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–2025 సంవత్సరానికి గానూ 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. కంచరపాలెంలోని డాక్టర్ బి ఆర్.అంబేడ్కర్ గురుకుల కార్యాలయంలో మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. మేహాద్రి గెడ్డ, సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్(కొమ్మాది), కోనాం, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, నక్కపల్లి(నర్సీపట్నం)లోని బాలికల గురుకుల పాఠశాలలు, సబ్బవరం, శ్రీకృష్ణాపురం, దేవరాపల్లి, గొలుగొండలోని బాలుర గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి ఫిబ్రవరి 23లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 5వ తరగతిలో ప్రవేశానికి మార్చి10 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https:// apbragcet.apcfss. in/ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 0891-2799641 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు ఏఎంసీ కాలనీలో 'జగనన్న సురక్ష'

అనకాపల్లి : స్థానిక నర్సింగరావుపేట సచివాలయం-3 ఏఎంసీ కాలనీలో బుధవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఫ్యామిలీ, కంటి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ మంత్రి జయరజని

కశింకోట : స్థానిక ఇందిరా కాలనీలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవంనిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి సర్పంచ్ మంత్రి జయరజని నివాళులర్పించారు. తహసీల్దార్, పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఎంపీడీవో తదితర అధికారులు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ గైర్హాజరు కావడంతో తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, హాస్టల్ ప్రతినిధి పి. పార్వతి, వార్డు సభ్యుడు దిమ్మల సూరిబాబు, మాజీ సభ్యురాలు మంత్రి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

కశింకోట : కశింకోటలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఫిబ్రవరి 3 ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం జరగనున్నట్లు రిటైర్డ్ ఎంఈవో నంబా రమణ తెలిపారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న శిబిరంలో ఉచితంగా నేత్ర పరీక్షలు, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

3న బహిరంగ వేలం

అనకాపల్లి : జీవీఎంసీ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలకు స్థానిక జోనల్ కార్యాలయంలో ఫిబ్రవరి 3 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జెడ్సీ సుర వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ ఏరియా, హోల్‌సేల్ మార్కెట్‌కు రూ. 25 లక్షలు, చేపల మార్కెట్‌కు రూ.44 వేలు, వివిధ రకాల చెట్ల ఫలసాయానికి రూ.12 వేలు ధరావత్తు చెల్లించి ఆక్షన్‌లో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 6004 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,620
మొదటి రకం	3,650	4,130
రెండో రకం	3,530	3,770
మూడోరకం	3,300	3,590

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
ఫైటర్	: సత్యనారాయణస్క్రీన్-1
బిఫోర్‌మ్యారేజ్ రామ్	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
సైంధవ్	: పర్తిసాయి
హనుమాన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-7 యూనిట్లు, బి పాజిటివ్-11 యూనిట్లు, ఒ పాజిటివ్-37 యూనిట్లు, ఎబి పాజిటివ్-4 యూనిట్లు, ఒ నెగెటివ్-2 యూనిట్లు, ఎబి నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 253 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 197 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



నా పేరు కోట నూకరత్నం. మాది మండలంలోని రేబాక గ్రామం. నా కుమారుడు కోట సత్యనారాయణ వికలాంగుడు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మా జీవితాలు బాగున్నాయి. గతంలో నా కుమారుడు పట్టణంలో పనికి వెళ్లి రాకపోకలు సాగించేందుకు చాలా ఇబ్బందులు పడేవాడు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. మాకు సంక్షేమ పథకాల ద్వారా ఏడాదికి రూ.1 లక్ష వరకు అందుతోంది. నాకు వైఎస్సార్ చేయూత రూ.18,500, రైతు భరోసా 13,500, నెలకు పింఛన్ రూ.3000 వస్తుంది. నా కుమారుడికి రూ.3 వేలు పింఛన్, నా కోడలికి అమ్మఒడి రూ.13 వేలు రావడంతో మా గ్రామంలోనే కిరాణా, పాన్‌షాప్ పెట్టుకున్నాం. దీంతో పాటు వైఎస్సార్ చేదోడు కూడా వస్తోంది. ఇలా సీఎం జగన్ చేస్తున్న సాయంతో షాపు నిర్వహించుకుంటు కుటుంబమంతా జీవిస్తున్నాం. నా వయసు 57 ఏళ్లు. గతంలో ఎప్పుడూ చూడని పాలన ఈ ఐదేళ్లలో చూస్తున్నాను. అన్ని సేవలు పొందుతున్నాం. మాకు అందే పథకాలు పోకుండా ఉండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాను.

- 'ఆసరా'తో ఆదుకుంటున్న సీఎం జగన్
- ఇలాంటి సంక్షేమ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని మహిళల హర్షం



ఆడపడుచులకు అండా దండ



సమావేశమైన డ్వాక్రా మహిళలు

తుమ్మపాల : నియోజకవర్గంలో అనకాపల్లి, కశింకోట మండలాలతో పాటు జీవీఎంసీ పరిధిలో 4,650 డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న సుమారు 47 వేల మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.147 కోట్లు లబ్ధి చేకూరింది. అనకాపల్లి మండలంలో 1,850 గ్రూపులకు చెందిన 19 వేల ఐదు వందల మంది మహిళలకు రూ.56 కోట్లు, కశింకోట మండలంలో 1,536 గ్రూపులకు చెందిన 15 వేల ఎనిమిది వందల మందికి రూ. 53 కోట్లు, జీవీఎంసీ పట్టణంతో పాటు విలీన గ్రామాలైన కొప్పాక, కొత్తూరు, సిరసపల్లి, రాజుపాలెం, వల్లూరు గ్రామాల్లోని 1,196 గ్రూపులకు చెందిన 11 వేల మందికి రూ. 38 కోట్లు నాలుగు విడతలుగా లబ్ధి చేకూరింది.

మహిళా పక్షపాతి సీఎం జగన్..

ఇచ్చిన హామీ నెలబెట్టుకుంటు ప్రతి ఏటా కొంత మొత్తంలో నగదు చెల్లిస్తు మహిళలను ఆదుకుంటున్న జగనన్నకు వారు హారతులు పడుతున్నారు. అనేక ప్రభుత్వాలు మారాయి. కాని ఇలా సంక్షేమాన్ని అందించిన సీఎంను చూడలేదు. డ్వాక్రా సంఘాల్లో ప్రతి మహిళకు కనీసం రూ. 2 వేల నుంచి అత్యధికంగా రూ. 20 వేల వరకు ప్రతి ఏటా రుణమాఫీ చెల్లించారు. మహిళలకు సీఎం జగన్ ఎంతో చేయూతనిస్తున్నారు.

– దాసరి గోపాలరావు

'ఆసరా'తో ప్రతి మహిళకు లబ్ధి..



ఈ నెల 23 నుంచి మొదలు పెట్టి నేటి వరకు డ్వాక్రా మహిళల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తు వైఎస్సార్ వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. డీబీటీ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే నగదు నేరుగా మహిళల ఖాతాల్లోనే జమ అవుతోంది. గత ప్రభుత్వంలో రుణం తీసుకున్న ప్రతి మహిళకు ఆసరా ద్వారా లబ్ధి అందుతోంది.

– శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఏపీఎం, అనకాపల్లి మండలం.

డ్వాక్రా మహిళలకు విడుదలైన వైఎస్సార్ ఆసరా నగదు వివరాలు

మండలం	మొదటి విడత రూ.	రెండవ విడత రూ.	మూడవ విడత రూ.	నాల్గవ విడత రూ.
అనకాపల్లి	13.92	13.99	13.99	13.92
కశింకోట	13.27	13.31	13.31	13.27
అనకాపల్లి టౌన్	8.99	9.12	10.02	10.35
మొత్తం	36.17	36.49	37.32	37.55

ఎనిమిది మందికి కంటి శస్త్ర చికిత్సలు



రోగులతో ఆస్పత్రి సభ్యులు

అనకాపల్లి : స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆస్పత్రి వైద్యుడు కె.మల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం 44 మందికి పరీక్షలు చేయగా 8 మంది ఆపరేషన్లు ఎంపిక కావడంతో వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి ఐదురోజులకు సరిపడా మందులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా 'ద్రాక్షారపు'

అనకాపల్లి : పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా ద్రాక్షారపు వెంకట వరహాలు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సూదికొండ మాణిక్యాలరావు, ఉపాధ్యక్షులుగా మెలిపాక ఈశ్వరరావు, నాగబాబు, సహాయ కార్యదర్శులుగా కొడమంచిలి రవి, కింతాడ సాంబశివరావు, కోశాధికారులుగా బయ్యవరపు నాగరాజు, కొడమంచిలి నూకరాజు, కన్వీనర్లుగా కందికొండ గంగరాజు, పైడివాడ గణేష్, కార్యవర్గ సభ్యులుగా 10 మంది ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కొణతాల జగన్నాథరావునాయుడు వ్యవహరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

అనకాపల్లి : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ విశాఖ డీపీటీవో అధికారి ఎన్ఎంయూ సభ్యులపై కక్ష సాధింపు చర్యలు విరమించాలని, రాష్ట్ర కార్యాలయం ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని, సంస్థకు నష్టం కలిగించే విధంగా షెడ్యూల్ బదిలీలు, మార్పులు చేసే విధానాలను విడనాడాలని, స్పెషల్ ఇంక్రిమెంట్లు అమలు చేయాలనే డిమాండ్లతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఏఎన్ రావు, సహాయ కార్యదర్శి ఎంపీఎస్‌కేపీ వర్మ, కోశాధికారి ఎం.బంగ్రారాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీలు



వాలీబాల్ పోటీలకు ఎంపికైన మహిళల జట్టుకు కప్ అందిస్తున్న నాయకులు

అనకాపల్లి : గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు ఆడుదాం-ఆంధ్రా పోటీలు ఉపకరిస్తున్నాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాస్థాయి పోటీలు ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గం నుంచి ఖోఖో, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడలకు మహిళలు, పురుషుల జట్ల నుంచి మొత్తం 12 టీములు ఎంపికయ్యాయని చెప్పారు. అంతకు ముందు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మెమెంటోలు అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారుల ఖాతాల్లో జమయ్యేలా నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీడీవో కేవీ నర్సింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, జిల్లా క్రీడల అధికారి కె.ఎస్.వి.రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



చురుగ్గా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

కశింకోట : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా రూ.కోటితో నిర్మించిన కల్యాణ మండపానికి వెళ్లే రోడ్డు వెడల్పు పనులను మంగళవారం చేపట్టారు. పరవాడ వద్ద ఉన్న అరబిందో ఫార్మా పరిశ్రమ సహకారంతో నిర్మించిన కల్యాణ మండపానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిధులు సమకూర్చారని, పనులు చేపట్టి నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. అలాగే ఇందిరా కాలనీ వద్ద ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు.

నేడు మహానేత వైఎస్సార్ తీర్థ మహోత్సవం



ఏఎస్‌పేటలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం

కశింకోట : మండలంలోని ఏఎస్ పేటలో బుధవారం మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి తీర్థమహోత్సవం జరగనుంది. 2009 నుంచి ఆయనపై అభిమానంతో ఏటా భారీ ఎత్తున తీర్థం నిర్వహిస్తూ వస్తున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఉత్సవాన్ని భారీగా నిర్వహించడానికి సన్నాహాలు చేశామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మలసాల కిషోర్ మంగళవారం తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆశీస్సులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రోత్సాహం, మలసాల వెంకట రమణారత్నం తీర్థ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు మహిళలకు మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరుపుతామన్నారు. 2 గంటలకు జిల్లా స్థాయి ఆహ్వాన గుర్రపు పరుగు పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు వరుసగా రూ.9 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు వంతున అందజేస్తామన్నారు. రాత్రి 8 గంటలకు కరీంనగర్ కింగ్స్ బృందంతో శంకర్ మాట్రిక్స్ డీ-16 రాజు డాన్స్ షో జరగనుందన్నారు.

జాతిపిత ఆశయ సాధనకు కృషి చేయాలి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్



ఉగ్గినపాలెంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



తాళ్లపాలెం గ్రంథాలయంలో గాంధీ చిత్రపటం వద్ద విద్యార్థుల నివాళి

అనకాపల్లి : నేటి యువత జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన జరిగిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బ్రిటీష్‌వారిని గడగడలాడించి శాంతియుతంగా దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చారన్నారు. ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిశోర్, పలు దేవాలయాల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గాంధీనగరం మెయిన్‌రోడ్డులో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

పలు గ్రామాల్లో..

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉగ్గినపాలెంలో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. విద్యార్థులతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం, పీడీ రాము, చిన్ని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, బాలికల హైస్కూళ్లలో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కశింకోటలో రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గాంధీకి నివాళులు

హెచ్ఎంలు ఎంఆర్‌వీ అప్పారావు, ఎంఎస్ స్వర్ణ కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో కూడా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులరిపంచారు. సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె. గోపాలరావు, రిటైర్డు ఎంఈవో నంబా రమణ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహనతో సమస్యల పరిష్కారం



తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

అనకాపల్లి : ప్రతి ఒక్కరూ పౌరహక్కులపై చైతన్యం కలిగి ఉండాలని తహసీల్దార్ గంగాధర్‌రావు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన వల్లూరులో మంగళవారం పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడారు. పౌరహక్కులపై గ్రామీణస్థాయి నుంచి అవగాహన కలిగి ఉన్నట్లయితే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు. గ్రామంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

జంతు సంపదను పరిరక్షించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట : జంతు సంపదను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. జంతు సంక్షేమ సామాజిక బాధ్యత పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం నరసింగబిల్లి హైస్కూల్లో విద్యార్థులకు జంతువుల పరిరక్షణపై అవగాహన కలిగించారు. జంతు సంపద మానవ మనుగడకు అవసరమన్నారు. వాటిపై కరుణ చూపాలన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే జంతువుల పరిరక్షణ పట్ల బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

యలమంచిలి రూరల్ : ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం అనే నినాదంతో యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం తుని మదర్ బ్లడ్ సెంటర్ పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 30 మంది స్వచ్ఛందంగా శిబిరానికి వచ్చి రక్తదానం ఇచ్చారు.

వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెలకొల్పి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి సమాయత్తమౌతున్నారు. రక్తదాతలకు మదర్ బ్లడ్ సెంటర్ సంస్థ ధృవీకరణ పత్రాలను అందజేసింది. రక్తదానం సేవ మాత్రమే కాదని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుంచుకోవాలని యలమంచిలి ఎంఈవో మీనాక్షి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవతి, విశ్రాంత అధ్యాపకుడు ఆడారి పూరీ జగన్నాథం, రమణ మాస్టారు అభిప్రాయపడ్డారు.

పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కొఠారు దుర్గారావు, గొల్లవిల్లి జానకి, గొల్లవిల్లి చిన్నాజీ, సీఏ బంగారు శెట్టి, మనం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండో రోజూ విద్యుత్ వినియోగదారుల సదస్సు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో రెండో రోజు మంగళవారం కూడా విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు వర్చువల్ విధానంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్ మాట్లాడుతూ వర్చువల్ పద్ధతిలో రెండు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి: చినదొడ్డిగల్లు శివారు కొత్తూరులో ఆంజనేయస్వామివారి ఆలయ వార్షికోత్సవం మంగళవా రం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి తమలపాకు పూజ లు, ఆంజనేయ హోమా లు నిర్వహించారు. కొత్తూరు, దొడ్డిగల్లు , వేంపాడు గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు, అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

హోరాహోరీగా ఎడ్లబళ్ల పరుగు



ఎడ్ల బళ్ల పందెంలో పరుగు తీస్తున్న గిత్తలు

మాడుగుల: జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం వాడపాడులో రాములోరి తీర్థం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి గ్రామస్తులను సీతా రాములను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా మరిడిమాంబ తీర్థ మహోత్సవం

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెంలో మరిడిమాంబ తీర్థమహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. అమ్మవారికి జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్ పైల పైడితల్లమ్మ, కోటేశ్వరరావు, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, యడ్ల వెంకటరావు తదితరులు పూజలు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం



అమ్మవారికి పూజలు చేస్తున్న సర్పంచ్ పైడితల్లమ్మ

జైభారత్ సమైక్యతా ర్యాలీ

కోటవురట్ల: మండల కేంద్రంలో జైభారత్ ఆధ్వర్యంలో జైహో హిందూ, ముస్లిం సమైక్యతా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పించి ర్యాలీ చేశారు. జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ గాంధీజీ చూపిన శాంతి మార్గం అనుసరణీయమన్నా రు. ఈ కార్యక్రమంలో జైహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ దాసరి వెంకటరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండబాబు, ఎం.గణేష్, సాందీప్‌రాజ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి కబడ్డీ విజేత నర్సీపట్నం

నర్సీపట్నం: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో నర్సీపట్నం విజయం సాధించింది. టీమ్ సభ్యులు మజ్జి సాయి, వజ్రపు మదన్, మట్టం మణికంఠ, ఎస్ఎస్.బషీర్, గొలుసు శశికుమార్, రోహిత్, ముఖేష్, పండు, శివాజీ అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఫైనల్‌లో నాతవరం, నర్సీపట్నం టీమ్‌లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ పోటీ లో నర్సీపట్నం టీమ్ విజయం సాధించింది. జిల్లా స్థాయిలో సత్తాచాటి రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తామని టీమ్ సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.